నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 13 ఫిబ్రవరి 2025 | NIZAMABAD

నాడు



2022లో పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉన్న ధర్పల్లి పల్లె ప్రకృతివనం

నేడు



నేడు కళ తప్పి కళావిహీనంగా మారిన పల్లెప్రకృతి వనం

## నాడు ఆహ్లాదకరం - నేడు కళావిహీనం

బీఆర్ఎస్ హయాంలో పల్లెలు పచ్చదనంతో కళకళలాడాయి. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వనాల్లో విరివిగా మొక్కలు నాటి వాటిని అర్బన్ పార్కులకు దీటుగా తీర్చిదిద్దారు. అవి పచ్చదనంతో కళకళలాడుతూ గ్రామస్తులకు ఆహ్లాదం పంచాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రకృతివనాల నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టించుకునే వారే కరువయ్యారు. ధర్పల్లి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం కళావిహీనంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లెప్రకృతి వనాన్ని పచ్చదనం వెల్లివిరిసేలా తీర్చిదిద్దాలని గ్రామస్తులు కోరుతున్నారు.


– ధర్పల్లి, ఫిబ్రవరి 12

**ఉమ్మడి జిల్లాలో** కొంతకాలంగా దేశీదారు మద్యం ఏరులైపారుతున్నది. యథేచ్ఛగా విక్రయాలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్రకు ఆనుకుని కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలు ఉండడంతో దేశీదారు ప్రభావం ఇక్కడి మద్యం విక్రయాలపై పడుతున్నది. పొరుగు రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున అక్రమ మద్యం డంప్ అవుతున్నది. వక్రమార్గాల్లో వస్తున్న దేశీదారును నియంత్రించడంలో ఎక్సైజ్ శాఖ విఫలమైనట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోటర్ సైకిళ్లపైనే పెద్దఎత్తున దేశీదారు మద్యాన్ని మన రాష్ట్రంలోకి తరలిస్తున్నట్లు సమాచారం. ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నదో తెలిసినప్పటికీ, నియంత్రణ చర్యలు తీసుకోవడంలో సంబంధిత శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జుక్కల్, బోధన్, నిజామాబాద్ అర్బన్, బాన్సువాడ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పొరుగు రాష్ట్రానికి చెందిన దేశీదారు ఏరులై పారుతున్నది. అడపా దడపా దాడులతో అక్కడక్కడ దేశీదారు పట్టుకుంటున్నప్పటికీ పూర్తి స్థాయిలో నియంత్రణ చేయడంలో ఆబ్కారీ శాఖ ఆపసోపాలు పడుతున్నది. రూ.లక్షల ఫీజులు చెల్లించి మద్యం వ్యాపారం నిర్వహిస్తున్న వారికి దేశీదారు దెబ్బ భారీగానే తగులుతున్నది. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని మద్యం వ్యాపారులకు ఈ అక్రమ మద్యం తలపోటును తీసుకు వస్తున్నది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వ ఆదాయానికి దేశీదారుతో భారీగానే గండి పడుతున్నది.

– నిజామాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# దేశీదారు ప్రవాహం !

- ఉమ్మడి జిల్లాలో ఏరులైపారుతున్న చీప్ లిక్కర్
- మహారాష్ట్ర నుంచి గుట్టుగా మోటర్ సైకిళ్లపై తరలింపు
- గ్రామాల్లో జోరుగా విక్రయాలు.. మద్యం అమ్మకాలపై తీవ్రప్రభావం
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి!
- పలుచోట్ల ఖరీదైన విస్కీలో కలుపుతున్న వ్యాపారులు
- పట్టించుకోని సంబంధిత శాఖాధికారులు



### అధిక లాభాలే కారణం..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో దేశీదారు దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్నది. తెలంగాణకు చెందిన మద్యం విక్రయిస్తే లాభాలు అంతంత మాత్రమేనని, మహారాష్ట్రలోని చౌక మద్యమైన దేశీదారును అమ్మడానికి ఆసక్తి చూపుతున్నారు. దేశీదారు ఒక్కో పెట్టే ధర రూ.3వేల వరకు లభిస్తున్నది. ఒక్కో పెట్టెలో 48 బాటిళ్లు ఉంటాయి. ఒక్కో సీసా ధర రూ.56 అయితే వీటిని వంద రూపాయలకు విక్రయిస్తున్నారు. ఈ మేరకు ఒక్కో పెట్టెకు రూ.5వేల వరకు ఆదాయం రాగా ఖర్చులు పోను ఒక్కో పెట్టెపై రూ.2వేల వరకు లాభాలు పొందుతున్నారు. ఆయా గ్రామాల్లో ఈ లెక్కన రోజుకు సుమారుగా పెద్ద ఎత్తున దేశీదారు విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తున్నది. దీంతో తెలంగాణ ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది. తెలంగాణ ప్రభుత్వ అనుమతితో విక్రయించాల్సిన మద్యానికి బదులుగా దేశీదారు విక్రయాలు పెరగడంతో సర్కారు ఖజానాకు రావాల్సిన లాభాలు ఆవిరై పోతున్నాయి. దేశీదారు విక్రయాలు బాహాటంగానే సాగుతున్నా, ఆబ్కారీ అధికారులు ముందస్తు సమాచారం ఇస్తేనే పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారే తప్ప, నేరుగా తనిఖీలు చేసిన దాఖలాలు లేవనే ఆరోపణలు ఉన్నాయి. వ్యాపారులు ఇష్టారీతిన అమ్మకాలు కొనసాగిస్తున్నప్పటికీ పోలీస్, ఆబ్కారీ అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారుల అండదండలతోనే దేశీదారు వ్యాపారం కొనసాగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ సర్కారు ద్వారా అనుమతులు పొందిన మద్యం దుకాణాదారులే ఈ విషయంపై ఎక్సైజ్ శాఖ తీరును ఎండగడుతున్నారు.

### ఖరీదైన విస్కీలో దేశీదారు..

దేశీదారును ఉమ్మడి జిల్లాకు విచ్చలవిడిగా సరఫరా చేస్తుండడంతో కల్తీ మద్యానికి ఆస్కారం ఏర్పడే వీలు లేకపోలేదు. కొన్నినెల క్రితం నిజామాబాద్ నగరంలోనే భారీ ధరలు కలిగిన విస్కీలో దేశీదారు మద్యాన్ని కలిపి విక్రయించిన ఘటన వెలుగు చూసింది. కొంతమంది మద్యం వ్యాపారుల ధన దాహానికి..ఇలాంటి ఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మద్యం విక్రయాల్లో అధిక లాభాల కోసం ఖరీదైన విస్కీలో దేశీదారును కలిపి అమ్ముతున్నట్లు మద్యం ప్రియుల్లోనూ చర్చ నడుస్తున్నది. చైన్ వైన్ షాపులను నిర్వహిస్తున్న వ్యాపారులే ఈ తరహా ఎత్తుగడలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తరచూ మద్యం బాటిళ్ల తనిఖీలు చేపడితే ఈ కల్తీ అరికట్టే వీలుంది. అడపా దడపా తనిఖీలు చేస్తుండడంతో దేశీదారు మాదిరిగానే కల్తీ కూడా రాజ్యమేలే అవకాశాలు ఏర్పడ్డాయి. బార్ అండ్ రెస్టారెంట్లలో ఎక్కువగా పెగ్గు చొప్పున అమ్మకాలుంటాయి. మద్యం ప్రియులు కాస్లీ విస్కీ ఆర్డర్ చేస్తే మొదటి రెండు పెగ్గులు నాణ్యమైన మద్యాన్ని విక్రయించి నమ్మిస్తారని ఆ తర్వాత ఆర్డర్ ఇచ్చే పెగ్గుల్లో కల్తీ మద్యాన్ని పోసి ఇస్తున్నట్లుగానూ పలుచోట్ల బహిర్గతమైంది. బార్ అండ్ రెస్టారెంట్లు బడా బాబుల చేతుల్లో ఉండడంతో అటువైపు ఆబ్కారీ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. దీంతో వారి ఆగడాలు మితిమీరుతున్నాయి. దేశీదారు అమ్మకాలకు ఎక్కువగా బెల్టు షాపులు కూడా ఆజ్యం పోస్తున్నాయి. సంబంధిత మద్యం దుకాణానికి చెందిన బాటిళ్లు కాకుండా వేరే రాష్ట్రానికి చెందిన దేశీదారు విచ్చలవిడిగా దొరుకుతున్నదని సమాచారం. ఇప్పటి వరకు ఆబ్కారీ శాఖ చేసిన దాడుల్లో పట్టుబడిన కేసుల్లోనూ బెల్టు షాపులే ఎక్కువగా ఉండడం గమనార్హం. కల్తీ మద్యం, దేశీదారు కట్టడికి బెల్టు షాపులతో పాటు బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాలపైనా కన్ను వేయాలని ఆబ్కారీ శాఖ అధికారులను మద్యం ప్రియులు కోరుతున్నారు.

# సజ్జన్‌పల్లిలో మద్యపాన నిషేధం

- మద్యం విక్రయిస్తే లక్ష రూపాయల జరిమానా
- తీర్మానం చేసుకున్న గ్రామస్తులు



సజ్జన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

లింగంపేట, ఫిబ్రవరి 12: మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామంలో మద్యం విక్రయాలపై సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇకనుంచి గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయాలు చేపడితే లక్ష రూపాయల జరిమానా విధించాలని తీర్మానించారు. బుధవారం గ్రామస్తులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొన్నారు. గ్రామంలో మద్యం విక్రయాలతో యువత చెడిపోవడంతోపాటు కుటుంబాలు వీధిన పడుతున్నాయని భావించి మద్యపాన నిషేధం విధిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. తీర్మానానికి వ్యతిరేకంగా మద్యం విక్రయాలు చేసిన వారికి లక్ష రూపాయలు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో పుట్టి పోశయ్య, లక్ష్మయ్య, రాములు, రవి, సాయికిరణ్, ఎల్లాగౌడ్, కిష్టయ్య, పోచయ్య, విష్ణు, వెంకాగౌడ్, మల్లేశ్, గంగారాం, సిద్ధిరాములు, మహిళలు పాల్గొన్నారు.

# అక్రమంగా సేకరిస్తూ.. హద్దులు దాటిస్తూ..



పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో ఆర్ఐ, పోలీసు

### కమ్మర్‌పల్లిలో పీడీఎస్ బియ్యం పట్టివేత

కమ్మర్‌పల్లి గ్రామశివారులోని గాంధీనగర్‌లో లక్ష్మణ్ అనే వ్యక్తి ఇంట్లో నిల్వచేసిన పీడీఎస్ బియ్యాన్ని (5.20క్వింటాళ్లు) పట్టుకున్నట్లు ఆర్ఐ శరత్‌కుమార్ తెలిపారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు లక్ష్మణ్ ఇంట్లో సోదాలు నిర్వహించగా ఏడు బస్తాల బియ్యం దొరికాయని పేర్కొన్నారు. వాటిని సీజ్ చేసి పంచనామా నిర్వహించి భద్రత నిమిత్తం వెంకటేశ్వర రైస్‌మిల్‌కు తరలించినట్లు ఆర్ఐ చెప్పారు.

- రాష్ట్రం దాటుతున్న పీడీఎస్ బియ్యం
- కమ్మర్‌పల్లి మండలం గాంధీనగర్ కేంద్రంగా అక్రమ రవాణా?
- పాత టీవీఎస్ చాంప్‌ల ద్వారా బియ్యం సేకరణ
- పట్టించుకోని సంబంధిత శాఖ.. మామూళ్ల మత్తులో ఆఫీసర్లు

మోర్తాడ్, ఫిబ్రవరి 12: పేదలకు అందాల్సిన పీడీఎస్ బియాన్ని కొందరు అక్రమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. జిల్లాలో గుట్టుగా సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటించి అందిన కాడికి దోచుకుంటున్నారు. కమ్మర్‌పల్లి మండలం గాంధీనగర్ కేంద్రంగా ఓ వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. అధికారులను మచ్చిక చేసుకొని గాంధీనగర్ నుంచి పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నా, సదరు వ్యక్తిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా, అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గాంధీనగర్ కేంద్రంగా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇందుకు మండల, జిల్లా స్థాయి నుంచి చెక్‌పోస్టు అధికారులకు ఠంఛన్‌గా నెలనెలా మామూళ్లు ముట్టడమే కారణమనే సమాధానం వస్తున్నది. పెద్దమొత్తంలో బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు మాత్రం తమకు ఏమీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

### బియ్యం సేకరణకు పాత టీవీఎస్ చాంప్‌లు

గాంధీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేయడంలో ఆరితేరాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏండ్ల తరబడి ఈ దందాను చేస్తూ కోటీశ్వరుడయ్యాడంటే అతిశయోక్తి కాదన్నారు. సదరు వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని సేకరించేందుకు 20 మందిని నియమించుకున్నాడని, వారందరికీ పాత టీవీఎస్ చాంప్‌లు, బియ్యం తూకం వేసేందుకు త్రాసులు కొనిచ్చాడని తెలిపారు. బియ్యం సేకరించి తీసుకువచ్చిన వారికి బియ్యాన్ని బట్టి కమీషన్ చెల్లిస్తాడని, వీరంతా ప్రజల నుంచి పదిరూపాలయకు కిలో బియ్యాన్ని కొనుగోలు చేస్తారన్నారు. ఇదే కాకుండా రేషన్‌డీలర్ల నుంచి కూడా డైరెక్ట్‌గా బియ్యాన్ని కొనుగోలు చేస్తాడని తెలిపారు. మన జిల్లాతోపాటు పక్క జిల్లాల్లో కూడా బియ్యాన్ని సేకరించడం గమనార్హం. ప్రతినెలా సేకరించిన బియ్యాన్ని టన్నులకొద్ది లారీల్లో రాష్ట్రాన్ని దాటించి అక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తారని సమాచారం.

### అధికారులకు మామూళ్లు..

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి జిల్లాలోని చాలా మంది అధికారులకు మామూళ్లు ముట్టజెప్పుతున్నట్లు తెలిసింది. ఒకవేళ బియ్యాన్ని పట్టుకున్నా కేసులు నమోదు చేయని సందర్భాలు ఉన్నట్లు సమాచారం. పట్టుకునేందుకు వచ్చిన అధికారులకు వెంటనే పైఅధికారుల నుంచి ఫోన్ రావడంతో కేసును మధ్యలోనే వదిలేస్తున్నారనే చర్చ ప్రజల్లో జోరుగా వినిపిస్తున్నది. తనకు అధికారుల నుంచి అందిన సమాచారం మేరకు బియ్యం నిల్వ చేసే ప్రాంతాలను మారుస్తూ ఉంటాడని స్థానికుల నుంచి వచ్చిన సమాచారం. చెక్‌పోస్టు వద్దకూడా ఇప్పటి వరకు సదరు వ్యక్తికి సంబంధించిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాలు పట్టుబడలేవంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు బ్రేక్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

### బియ్యం అక్రమ రవాణా నేరం

“పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నేరం. గాంధీనగర్‌లో పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పట్టుకున్నాం. ఎవరైనా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా అధికారులకు సమాచారం అందించాలి.”

– శరత్‌కుమార్, ఆర్ఐ, కమ్మర్‌పల్లి

# మున్నూరు కాపుల నిర్బంధం

- బిచ్కుంద, భిక్కనూర్‌లో ముందస్తు అరెస్టు
- ‘సీఎం ఇంటి ముట్టడి’ని అడ్డుకున్న పోలీసులు



బిచ్కుందలో మున్నూరు కాపుల ముందస్తు అరెస్ట్



భిక్కనూర్ పీఎస్‌లో మున్నూరు కాపు సంఘ నాయకులు

బిచ్కుంద/భిక్కనూర్, ఫిబ్రవరి12: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మున్నూరు కాపులు బుధవారం తలపెట్టిన ‘సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడి’ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. బిచ్కుంద, భిక్కనూర్ మండలం రామేశ్వరపల్లెలో మున్నూరుకాపులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రూ.5వేల కోట్లతో మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొందపెడతామని హెచ్చరించారు. కులగణనలో బీసీలను తక్కువగా చూపించడం సరికాదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలను తిరగనివ్వబోమని హెచ్చరించారు. బిచ్కుందలో అరెస్టయిన వారిలో నాల్చర్ శ్రీనివాస్, విష్ణు, బాలు గణేశ్, భిక్కనూర్‌లో రమేశ్, కేతిబాల్‌రాజ్ ఉన్నారు.

# కస్టడీలో నిందితుడి ఆత్మహత్యాయత్నం!

- చోరీ కేసులో విచారణ పేరిట తీసుకెళ్లిన పోలీసులు!
- పోలీసుల వేధింపులతోనే తన భర్త ఆత్మహత్యకు యత్నించాడని భార్య ఆరోపణ



చికిత్స పొందుతున్న రాజు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 12: చోరీ కేసులో అనుమానితుడిగా కస్టడీలోకి తీసుకున్న ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. సదరు వ్యక్తిని దవాఖానలో చేర్పించిన తర్వాత కుటుంబసభ్యులకు సమాచారం అందించగా.. విచారణ పేరుతో తనభర్తను వేధింపులకు గురిచేయడంతో ఆత్మహత్యకు యత్నించాడని భార్య ఆరోపించింది. బాధితుడి కుటుంబీకులు తెలిపిన వివరాల తెలిపిన ప్రకారం.. నిజామాబాద్ నగరానికి చెందిన ఓ ప్రముఖ వైద్యుడి వద్ద రాజు, లక్ష్మి దంపతులు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. వీరు రెండురోజుల క్రితం మోస్రాలోని వారి బంధువుల ఇంట్లో పెండ్లికి వెళ్లి వచ్చారు. అయితే అక్కడ చోరీ జరిగిందని, ఈ దొంగతనం రాజు చేశాడని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ముగ్గురు వ్యక్తులు రాజు ఇంటికి మఫ్టీలో వచ్చి రాజును బలవంతంగా తీసుకెళ్తుండగా అడ్డువచ్చిన భార్య, బావమరిదిపై చేయిచేసుకొని వాహనంలో ఎక్కించుకొని పోయారు. దీంతో భార్య లక్ష్మి, కుటుంబీకులు నగరంలోని అన్ని పోలీసుస్టేషన్లతోపాటు బోధన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లినా రాజు ఆచూకీ లభించలేదు. చివరికి నగరంలోని నాల్గో టౌన్ పక్కన ఉన్న మరో స్టేషన్‌లో ఉన్నట్లు తెలియడంతో అక్కడికి వెళ్లి ఆరా తీశారు. ‘మీ భర్త మా వద్ద ఉన్నాడని, విచారిస్తున్నామని, విచారణ పూర్తయ్యాక పంపుతామని’ చెప్పడంతో వారు ఇంటికి తిరిగివచ్చారు. రాజు జిల్లా ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నట్లు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ రావడంతో భార్య లక్ష్మి హుటాహుటిన అక్కడికి చేరుకున్నది. పోలీసులు వేధించడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడని వాపోయింది. నిజంగా చోరీ చేసి ఉంటే కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పర్చాల్సిన బోధన్ పోలీసులు.. రాజును తాము కస్టడీలోకి తీసుకోలేదని, తమకు తెలియదని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తున్నది.